

నేటి అలంకారం
మహిషాసుర మర్దిని దేవి
మహానవమి





దుర్గే దుర్గతినాశని..

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

- దుర్గాదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ
- రాత్రి 7 గంటలకు లక్ష దాటిన భక్తుల సంఖ్య
- ఉత్తరాంధ్ర నుంచి పెరిగిన భవానీల రాక
- నేడు మహిషాసురమర్దినిగా దర్శనం



శరన్నవరాత్రి మహోత్సవాల్లో దుర్గాష్టమి రోజైన మంగళవారం శ్రీదుర్గాదేవిగా విజయవాడ శ్రీకనకదుర్గమ్మ దర్శనమిచ్చారు. పంచ ప్రకృతి మహాస్వరూపాల్లో మొదటిదైన దుర్గా రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. కోటి సూర్యప్రభలతో వెలుగొందే అమ్మను కనులవిందుగా వీక్షించి తన్మయత్వం చెందారు. ఆయురారోగ్యాలను ప్రసాదించే దివ్యరూపిణి దుర్గమ్మను శరణువేడుకున్నారు. రాత్రి ఏడు గంటలకు లక్ష మంది వరకు భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు.



ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లలో పోటెత్తిన భక్తులు





పారాచ్యూట్ రైడ్



కెమెలియన్ ఫ్లూట్ మోడ్రన్ మ్యూజిక్



నృత్య అభినయం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి భారీగా తరలి వస్తున్నారు. కనకదుర్గమ్మ మంగళవారం శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దశమి గడియలు దగ్గర పడుతుండడంతో ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి భవానీల రాక పెరిగింది. అమ్మవారిని రాత్రి ఏడు గంటల మిగతా 6లో..



తోట్లవల్లూరులో నీటిలో మునిగిన పసుపు పంట

ఉగ్ర కృష్ణమ్మ

ప్రకాశం బ్యారేజీ నుంచి 6.54 లక్షల క్యూసెక్కుల విడుదల

- లంక గ్రామాలు, పంట పొలాల్లోకి భారీగా వరద నీరు
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- 1,451.48 హెక్టార్లలో వాణిజ్య పంటలకు నష్టం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ప్రకాశం బ్యారేజీ నుంచి 6.54 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో మంగళవారం కూడా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ముందుకు సాగింది. మోపిదేవి మండలం కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, మోపిదేవి వార్పు తదితర గ్రామాల్లోకి వరద నీరు మరింతగా చేరింది. ఈ గ్రామాల్లోని వాణిజ్య పంటలు, కూరగాయల తోటలు ముంపులోనే మిగతా 6లో..

అన్నదాతకు దన్ను!

ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక

- ఈ ఏడాది పరిమితి లేకుండా కొనుగోళ్లు
- అత్యవసర పరిస్థితుల్లో ఏ మిల్లుకైనా తరలించే వెసులుబాటు
- ధాన్యం రవాణాకు జీపీఎస్ తప్పనిసరి
- తేమశాతం 22 ఉన్నా కొనుగోలు చేయాలని రైతుల విజ్ఞప్తి
- సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో రైతులు, మిల్లర్లు, అధికారుల నిర్ణయం

ఏటా ప్రకృతి విపత్తులతో పంటను కోల్పోతున్న అన్నదాతకు దన్నుగా నిలిచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికను రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామంలో పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు శివరాం ప్రసాద్, ఉయ్యూరు ఆర్డీవో హేలాషారోన్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, మిల్లర్లతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందులు, వాతావరణం అనుకూలించని సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించుకుందామని నిర్ణయం తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం: జిల్లా వ్యాప్తంగా 1.61 లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారు. 13 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. గత కొన్నేళ్లుగా 6.50 లక్షల టన్నుల లోపు రైతుల నుంచి ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తూ వచ్చారు. మిగిలిన ధాన్యం రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి మోసపోతున్నారు. ధాన్యం మద్దతు ధరలోనూ ప్రైవేటు వ్యాపారులు కోతపెడుతున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో పరిమితులను ఎత్తివేసినట్లు పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్ తెలిపారు. రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు.



వరి పైరు

అధికారుల దృష్టికి రైతుల డిమాండ్లు

ధాన్యం కొనుగోలు కోసం రైతులకు సకాలంలో గన్నీ బ్యాగులను అందించాలని, యంత్రాల ద్వారా వరికోతలు పూర్తి చేస్తే ధాన్యంలో 22 పాయింట్ల మేర తేమశాతం ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలని, తేమశాతం ఆధారంగా మద్దతు ధరను నిర్ణయించాలని రైతులు ఈ సమావేశంలో కోరారు. రైతు సేవా మిగతా 6లో..

నేడు రూ.102.26 కోట్ల పింఛన్ల పంపిణీ


మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్లు జిల్లాలోని రూ.2,35,655 మందికి రూ.102.65 కోట్లు పంపిణీ చేయనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్ తెలిపారు. కొత్తగా 501 మందికి వితంతు పెన్షన్లు రూ. 4వేల చొప్పున రూ. 20,04,300 సెప్టెంబరు నెలకు మంజూరయ్యాయని పేర్కొన్నారు. బుధవారం ఉదయం మంత్రి కొల్లు రవీంద్ర ఈ పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తారని తెలిపారు.

3 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ
» డీఈవో సుబ్బారావు
6

మచిలీపట్నం నగరాభివృద్ధే లక్ష్యం
» మంత్రి కొల్లు రవీంద్ర

8
దసరా వచ్చిందయ్యా..!









దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు 2025

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల తొమ్మిదో రోజు దుర్గాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దుర్గమ్మను పలువురు ప్రముఖులతో పాటు సినీనటి హేమ, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తదితరులు దర్శించుకున్నారు.

ఆదాయం రూ.45.56 లక్షలు

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి దసరా మహోత్సవాలలో ఎనిమిదో రోజు సోమవారం మూలా నక్షత్రంనాడు దేవస్థానానికి వివిధ రూపాల్లో రూ.45,56,853ల ఆదాయం వచ్చినట్టు ఈవో శీనానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.2,83,815లు, రూ.100 ప్యాక్ ద్వారా రూ.39,81,900లు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన సేవ(రూ.3000) ద్వారా రూ.54 వేలు, చండీహోమం (రూ.4000) ద్వారా రూ.24వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన ద్వారా రూ.15,348లు, పుస్తకాలు, ఫొటోలు, కాలెండర్లద్వారా రూ.10,770, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ.1,83,760, ఇతరత్రా ఆదాయం రూ.3,260లు మేరకు వచ్చింది. మొత్తం రూ.45,56,853లు ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు. కాగా, తొమ్మిదోరోజు మంగళవారం సాయంత్రానికి వివిధ రూపాల్లో రూ.40,12,917లు ఆదాయం లభించినట్లు ఈవో ప్రకటనలో తెలిపారు.

జై భవానీ..

- దుర్గమ్మ నామస్మరణతో కిలోమీటర్ల నడక
- దారిలో అల్పాహారంతో దాతల ఆదరణ
- ఇంద్రకీలాద్రికి పాదయాత్రగా వస్తున్న భవానీలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కాగానే రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు దుర్గమ్మను మొక్కుతూ మాలాధారణ చేపడతారు. కోరిన కోర్కెలు తీర్చే జగన్మాతను దర్శించుకోవడానికి దసరా చివరి మూడురోజులు లక్షల్లో భవానీలు తమ తమ స్వస్థలాల నుంచి అకుంఠిత దీక్షతో తరలివస్తారు. పాదయాత్రగా వచ్చేవారు దూరప్రాంతాల నుంచి అమ్మ దర్శనానికి కొద్ది రోజుల ముందుగానే బయలుదేరి నగరానికి చేరుకుంటారు. వారిలో చిన్నపిల్లల నుంచి వృద్ధులు, మహిళలు ఉంటారు. గమ్యాన్ని చేరేవరకు ఎన్నో కష్టాలను భరిస్తూంటారు. మధ్యమధ్యలో సేదతీరుతూ దాతలు ఇచ్చిన ఆహారాన్ని స్వీకరిస్తూ నడక కొనసాగిస్తూ భక్తితో ఇంద్రకీలాద్రిని చేరుకుంటారు. కాళ్ల నొప్పులు వచ్చినా, బొబ్బలు కట్టినా కనకదుర్గమ్మ దర్శనమే పరమావధిగా ముందుకుసాగుతారు.ముఖ్యంగా కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికశాతం మంది భవాని భక్తులు ఉంటారు. దసరా సమయంలో 9 నుంచి 12 రోజులు మాలాధారణ వేస్తారు. దూరాన్ని బట్టి భక్తులు పాదయాత్ర ప్రారంభిస్తారు. కాలినడకన అమ్మవారిని దర్శించుకోవడానికి వందల కిలోమీటర్లు ప్రయాణిస్తారు. అక్కడక్కడ విశ్రాంతి తీసుకుంటూ వస్తామని భక్తులు చెబుతున్నారు.



కాలినడకన అమ్మవారిని చేరుకోవడం ఓ అనుభూతి

- భవానీ భక్తులు (కాకినాడ)

కాలినడకన వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఒక అనుభూతి. కనకదుర్గమ్మ దయ వల్ల ఆరుగురం కలిసి గురువారం సాయంత్రం కాకినాడ నుంచి నడక ప్రారంభించాం. ఎక్కువగా సాయంత్రం సమయంలో నడక సాగిస్తూ రాత్రి 9, 10 గంటల వరకు ప్రయాణిస్తాం. మధ్యాహ్నం ఎండ వేడికి అలసటతో పాటు పాదాలు తొందరగా బొబ్బలు కడతాయి. వాతావరణాన్ని బట్టి ఉదయం నాలుగు గంటల నుంచి ఏడు, ఎనిమిది వరకు నడిచేవాళ్లం. అనంతరం విశ్రాంతి తీసుకుని సాయంత్రం నాలుగు, ఐదు గంటలకు నడక ప్రారంభించేవాళ్లం. అమ్మ దయ.. ప్రజలు, దాతల ఆదరణతో మమేకం అవుతూ.. వారిచ్చే ఫలహారాలు స్వీకరిస్తాం. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తే ఏటా పాదయాత్రగా వచ్చి అమ్మవారిని దర్శించుకునే వారి సంఖ్య పెరుగుతుంది.



కాలినడకన వస్తున్న భవానీలు

వరుసగా మూడో ఏడాది వస్తున్నాం..

గోవింద, వీరబాబు, కనకరాజు (పెద్దాపురం)

ఏటా అమ్మ దీక్ష చేపడతాం. కాలినడకన రావడం ఇది మూడోసారి. పాదయాత్రగా అందరం కలిసి రావడం వల్ల అలసట తెలియదు. అందరం సరదాగా సాగడం నిజంగా ఒక అనభూతి. ప్రజలు ఎక్కడికక్కడ పళ్లు, నీళ్ల బాటిళ్లు, ఇతర ఆహార పదార్థాలు ఇస్తున్నారు. రాత్రి సమయంలో నిద్రించేందుకు స్థలం లేకపోతే మధ్యదారిలో గ్రామస్తులు కాని, షాపుల యజమానులు కాని వారికి తెలిసిన ప్రదేశాలు చూపించేవారు. అమ్మవారి దయవల్ల ఎక్కడా ఆటంకం కలగలేదు.



సర్పవరం నుంచి పాదయాత్రగా వచ్చిన భవానీలు

భవానీ భక్తులకు ప్రాధాన్యం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భవానీ భక్తులకు పెద్ద పీట వేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. భవానీ మాలభక్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు రెండు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశామని తెలిపారు. గుంటూరు, కృష్ణాజిల్లాల కలెక్టర్లతో మాట్లాడి భవానీ భక్తులకు సరిహద్దుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయటంతో పాటు స్వచ్ఛమైన తాగునీరు, పాలు, మజ్జిగ, బిస్కెట్లు అందుబాటులో ఉంచాలని సూచించినట్లు తెలిపారు. భవానీలు పెద్ద ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

దివ్య రూపిణి దుర్గమ్మా

భక్తులకు అమ్మ దర్శనం



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా ఉత్సవాలలో మంగళవారం దుర్గాదేవి అలంకారంలో దుర్గమ్మను భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. క్యూలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధుల్లో ఉన్న సిబ్బంది మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనానాయక్ సమన్వయంతో భక్తులు, దివ్యాంగులు, వృద్ధులు, చంటిపిల్లలకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రిపై ఎనిమిదోరోజు దుర్గాదేవి అలంకారంలో అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ దంపతులు, ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు కుటుంబసభ్యులు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, పలువురు న్యాయమూర్తులు ఉన్నారు.

వర్షంలోనూ దుర్గమ్మ నామస్మరణ

నగరంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంలోనూ భక్తులు దుర్గమ్మ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వర్షంలోనూ భక్తులు అమ్మవారి దర్శనం కోసం పోటెత్తారు. దేవస్థానం అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



హరి జవహర్‌లాల్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో





కుటుంబసభ్యులతో సీపీ రాజశేఖర్‌బాబు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



దివ్యాంగురాలికి సేవాదళ్ సేవ



పాలు అందజేస్తున్న స్వచ్ఛంద సేవకులు



ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

అమ్మ భక్తులకు అలుపెరగని సేవ

విజయవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దసరా నవరాత్రులలో అమ్మవారి దర్శనానికి రాష్ట్రం నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు అవసరమైన సేవలందించేందుకు దేవస్థానం, జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పలు ఏర్పాట్లుచేశాయి. చిన్నారులకు వేడి పాలు, క్యూలైన్లలో ప్రతి ఒక్కరికి బిస్కెట్లు అందిస్తున్నారు. మొదటి ఎనిమిది రోజుల్లో 1,75,000 బిస్కెట్ ప్యాకెట్లను, 3.60 లక్షల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. 6,600 లీటర్ల పాలు భక్తులకు అందజేశారు. 35 లక్షల మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శనంలో ఇబ్బందులు కలగకుండా బ్యాటరీ కార్లు, చక్రాల కుర్చీలు ఏర్పాటుచేశారు. అధికార యంత్రాంగంతో పాటు వందలాదిమంది సేవకులు స్వచ్ఛందంగా రేయింబవళ్లు భక్తులకు సేవలందిస్తున్నారు. రెడ్‌క్రాస్ సంస్థ రోజుకు మూడు షిఫ్టుల్లో వృద్ధులు, దివ్యాంగులకు సేవలందిస్తోంది. పోలీసు యంత్రాంగం 'సేవాదళ్' పేరిట భక్తులకు సాయపడుతోంది. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ భక్తులకు పాలు అందిస్తోంది. 'శక్తి సేవ' వలంటీర్లు భక్తులకు సేవలందిస్తున్నారు. నగరపాలక సంస్థ నుంచి 1490 మంది పారిశుధ్య కార్మికులు రేయింబవళ్లు అలుపెరగకుండా ఆలయ ప్రాంగణంలో సేవలందిస్తున్నారు. మూలానక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు కొండపై పరిశుభ్రంగా ఉండటం చూసి పారిశుధ్య సిబ్బందిని అభినందించి వారితో ప్రత్యేకంగా ఫోటో దిగారు.



కొండపైకి బస్సులు వెళ్లకుండా అడ్డంగా ఉన్న బారికేడ్లు

బారికేడ్లు తొలగించరూ..!

పాయకాపురం : మూలా నక్షత్రం రోజున పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు భక్తులకు ఇబ్బందిగా మారాయి. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సర్వీస్‌కు ఆటంకం ఏర్పడుతోంది. మూలా నక్షత్రం తర్వాత బారికేడ్లు అలాగే వదిలి వేయడంతో బస్సులు కొండపైకి వెళ్లే మార్గం లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా బారికేడ్లు తొలగించాలని భక్తులు కోరుతున్నారు.



జల్లు స్నానాల వద్ద గజ ఈతగాళ్లు

గజ ఈతగాళ్లు సిద్ధం..

పాత రాజరాజేశ్వరిపేట : దసరా పండుగను పురస్కరించుకుని భక్తులకు ఏర్పాటు చేసిన జల్లు స్నానాల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

3 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

- జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు

విజయవాడ/మచిలీపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో మెగా డీఎస్సీ-2025లో భాగంగా ఎంపికైన 1203 మంది అభ్యర్థులకు ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారులు యూవీ సుబ్బారావు, డీఈవో పీవీజే రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు వారికి కేటాయించిన కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆయన వెల్లడించారు. పామర్రులోని ప్రగతి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో 945 మందికి, నిడమనూరులోని వాహిణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో 258 మంది అభ్యర్థులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులందరూ తమకు కేటాయించిన కేంద్రాల్లో ఎనిమిది రోజుల ఇండక్షన్ ట్రైనింగ్‌కు తప్పనిసరిగా హాజరవాలని ఆయన సూచించారు.

అన్నదాతకు దన్ను!

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) నమోదు చేసే తేమశాతానికి, మిల్లుల వద్ద చూపుతున్న తేమశాతానికి రెండు మూడు పాయింట్లు తేడా వస్తోందని, దీంతో మద్దతు ధరను కోల్పోవాల్సి వస్తోందని, ఆర్ఎస్‌కేలలో నిర్ధారించిన తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన అధికారులు ఆర్ఎస్‌కేలలో, మిల్లుల వద్ద ఒకే కంపెనీకి చెందిన తేమశాతం కొలిచే యంత్రాలను ఉంచుతామని, దీంతో రైతులకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు సకాలంలో వాహనాలు సమకూర్చడం లేదని, రైతులు సొంత వాహనాలు ఏర్పాటు చేసుకుని ధాన్యం రవాణా చేసేందుకు అనుమతులు త్వరితగతిన ఇవ్వాలని, రవాణా చార్జీలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టకుండా విడుదల చేయాలని ఈ సందర్భంగా రైతులు కోరారు. ధాన్యం రవాణాకు సంబంధించి వాహనాలను సమకూర్చడంతో పాటు, ఇప్పటి వరకు పెండింగ్‌లో ధాన్యం రవాణా చార్జీల బకాయిలను కూడా సాధ్యమైనంత త్వరగా విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మిల్లర్ల ద్వారా గన్నీ బ్యాగులు ఇచ్చే సమయంలో ధాన్యం కొనుగోలులో మధ్యవర్తులుగా ఉన్నవారు తమకు అనుకూలమైన రైతులకు ముందస్తుగా గన్నీ బ్యాగులు ఇస్తున్నారని, దీంతో అధికశాతం మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతులు తెలిపారు. మిల్లర్లతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి గన్నీ బ్యాగులను అందిస్తామని, ఈ ప్రక్రియపై నిత్యం నిఘా ఉంచుతామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో పాటు ధాన్యం లోడుతో వచ్చిన లారీలను కాటా వేసే సమయంలో ధాన్యం తూకం ఎంతమేర ఉందో తెలిసేలా మిల్లుల బయట కనపడేలా డిజటల్ మీటరును ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.

జిల్లా యూనిట్‌గా ధాన్యం కొనుగోలు

యంత్రాల ద్వారా ఒకేసారి పలు ప్రాంతాల్లో కోతలు పూర్తిచేయడంతో ఇబ్బడిముబ్బడిగా ధాన్యం మిల్లులకు వస్తున్నాయని, దీంతో మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం దించుకోవాల్సి వస్తోందని మిల్లర్లు తెలిపారు. వర్షం పడితే మరింతగా ధాన్యం మిల్లులకు చేరుతోందని, తేమశాతం అధికంగా ఉన్న ధాన్యం ఒకేసారి మిల్లుకు వస్తే డ్రయ్యర్ సామర్థ్యం సరిపోక తాము నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరస్థితిలో ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వస్తే ఆయా గ్రామాల్లోని ధాన్యం జిల్లాలోని ఏ మిల్లుకైనా విక్రయించేలా అనుమతులు ఇస్తామని, అవసరమైతే ఇతర జిల్లాలోని మిల్లులకు ధాన్యం పంపుతామని అధికారులు చెప్పారు. తేమశాతం అధికంగా ఉన్న ధాన్యం మిల్లులో నిల్వ ఉంచితే తాము నష్టపోతున్నామని మిల్లర్లు తెలపగా, ధాన్యం మరపట్టే సమయంలో వచ్చే తౌడు, నూకలు, ఊక తదితరాల లెక్కలు మిల్లర్లు చెప్పడంలేదని, మిల్లులకు నష్టం రాదని, ఈ సాకుతో రైతులను ఇబ్బందులపాలు చేయవద్దని రైతులు కోరారు. ధాన్యంలో నాణ్యత నిర్ణయించేందుకు వ్యవసాయశాఖ అధికారులకు అధికారాలు ఇవ్వాలని, గతంలో ఈ పద్ధతి అమలులో ఉండేదని రైతులు తెలిపారు. మినీ మిల్లింగ్ మిషన్‌లను అందుబాటులో ఉంచితే, అక్కడే ధాన్యంలో నాణ్యత తెలుస్తుందని చెప్పారు. మిల్లర్లు, రైతులకు ఇబ్బంది లేకుండా సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుందామని ఈ సమావేశంలో నిర్ణయించారు.

ఉగ్ర కృష్ణమ్మ

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. చల్లపల్లి మండలం నడకుదురు, రాముడుపాలెం, ఆముదార్లంక, లచ్చిగానిలంక తదితర గ్రామాల పరిధిలోని కరకట్ట వెంబడి ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోని పసుపు, కంద, అరటి తోటల్లోకి వరద నీరు చేరింది. అవనిగడ్డ మండలం పులిగడ్డ, పల్లెపాలెం, సీతాలంక తదితర గ్రామాల్లోని పంటలు నీట మునిగాయి. తోట్లవల్లూరు మండలం భద్రిరాజుపాలెం, వల్లూరుపాలెం, పాములంక, దేవరపల్లి, చాగంటిపాడు, రొయ్యూరు, ఐలూరు గ్రామాల పరిధిలోని ఉద్యాన పంటల తోటల్లోకి భారీగా వరదనీరు వచ్చింది. రెండు రోజులుగా వరద నీరు పంట చేలలోనే నిల్వ ఉండటంతో పంటలు రంగు మారి చనిపోయేస్థితికి చేరుకున్నాయి. కృష్ణానదికి వరద మరో మూడు, నాలుగు రోజులు కొనసాగుతుందని, దీంతో పంటలు కోల్పోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగాయలంక మండలం ఎదురుమొండి తదితర గ్రామాల వద్ద కృష్ణానది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. అవనిగడ్డ మండలం యడ్లంక గ్రామం వద్ద వరద నీటి ప్రవాహం మరింతగా పెరిగింది. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని మండలాల్లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, జలవనరులశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికపుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

1451.48 హెక్టార్లలోని వాణిజ్య పంటలకు దెబ్బ

కృష్ణానది వరదల కారణంగా మంగళవారం నాటికి 2,171 మంది రైతులకు చెందిన 1451.48 హెక్టార్లలో వాణిజ్య పంటలు నీటిలో మునిగినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికను పంపారు. పసుపు, అరటి, కంద, బొప్పాయి, కూరగాయల తోటలు నీటిలోనే ఉన్నట్లు పేర్కొన్నారు. కంకిపాడు మండలంలో ఎనిమిది హెక్టార్లు, పెనమలూరు మండలంలో 28.50 హెక్టార్లు, తోట్లవల్లూరు మండలంలో 961.98 హెక్టార్లలో వాణిజ్య పంటలు నీటమునిగాయి. మోపిదేవి మండలంలో 180.40 హెక్టార్లు, అవనిగడ్డ మండలంలో 44.80 హెక్టార్లు, చల్లపల్లి మండలంలో 222 హెక్టార్లు, ఘంటసాల మండలంలో 5.80 హెక్టార్లలో వాణిజ్య పంటలు ముంపులో ఉన్నాయి.

జిల్లా అంతటా వర్షం

జిల్లా అంతటా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మచిలీపట్నం, గుడివాడ తదితర ప్రాంతాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ నెల 4వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

దుర్గే దుర్గతినాశని..

(5వ పేజీ తరువాయి)

సమయానికి 1,05,972 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. 32,006 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీ కొనసాగుతోంది. వినాయకుడి ఆలయం నుంచి కెనాల్ రోడ్డు వరకు క్యూలైన్లు ఖాళీగా కనిపించాయి. అక్కడి నుంచి ఇంద్రకీలాద్రి వరకు మొత్తం క్యూ లైన్లలో భక్తుల రద్దీ కనిపించింది. క్యూల్లో ఉన్న భక్తులు జై భవానీ నినాదాలు చేస్తూ ప్రధానాలయం వద్దకు చేరుకున్నారు.

తొమ్మిది రోజులు.. 10 లక్షల మంది

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఇప్పటివరకు 10,81,190 మంది భక్తులు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సెప్టెంబరు 22 నుంచి మొదలయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు 10 లక్షలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మూలానక్షత్రం రోజున ఆలయం మూసివేసే సమయానికి 1,94,097 మంది భక్తులు సరస్వతీ అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్నారు. 22న 84,417 మంది, 23న 90,190 మంది, 24న 1,00,110 మంది, 25న 1,30,846 మంది, 26న 1,25,486 మంది, 27న 1,21,690 మంది, 28న 1,28,382 మంది, 29న 1,94,097 మంది అమ్మవారిని వివిధ అలంకారాల్లో దర్శనం చేసుకున్నారు. మంగళవారం 1,05,972 మందికి అమ్మవారు దర్శనం ఇచ్చారు. మొత్తం ఇప్పటి వరకు 10,81,190 మంది కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అన్న ప్రసాదాన్ని 2,70,791 మంది స్వీకరించారు.



కొండాలమ్మ ఉత్సవమూర్తిని పల్లకీపై మోస్తున్న వెనిగండ్ల, రావి

కొండాలమ్మ ఆలయంలో దుర్గాష్టమి వేడుకలు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, కూటమి ప్రభుత్వానికి కొండాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమి వేడుకలను వెనిగండ్ల రాము ఘనంగా ప్రారంభించారు. వేమవరం కొండాలమ్మ దేవస్థానంలో మంగళవారం అమ్మవారు కనకదుర్గాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి పంచలోహ ఉత్సవమూర్తి పల్లకీ ఉత్సవాన్ని ఎమ్మెల్యే రాము, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. అనంతరం 30 వేలమంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సంప్రదాయ డప్పులు, కేరళ వాయిద్యాలు, గరగర డప్పులు, కాళికా నృత్య ప్రదర్శనలు, కోలాటాలు, భజనల నడుమ వేమవరం, వడ్లమన్నాడు, పద్మాలపాలెం, కౌతవరం గ్రామాలలో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాను మరణించి.. నలుగురికి ప్రాణం

- బ్రెయిన్ డెడ్ అయిన ప్రదీప్ అవయవదానం



గన్నవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తాను మరణించి నలుగురికి పునర్జన్మనిచ్చాడు. నాలుగు కుటుంబాల్లో వెలుగులు నింపాడు. ఆస్పత్రిలో బంధువును పరామర్శించేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురై కుటుంబానికి దూరమయ్యాడు మొవ్వ ప్రదీప్‌కుమార్. పెనమలూరు మండలం చోడవరం గ్రామానికి చెందిన ప్రదీప్ కుమార్(46) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. సెప్టెంబరు 25న గన్నవరం మండలం చినఅవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు వస్తుండగా శ్రీనివాస హేచరీస్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సెప్టెంబరు 29న బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. ఇదే విషయాన్ని కుటుంబసభ్యులకు వివరించగా ప్రదీప్‌కుమార్ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చి జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్‌ను కలిశారు. లివర్, ఒక కిడ్నీ తాడేపల్లిలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి, మరో కిడ్నీ గుంటూరు సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు, లంగ్స్ హైదరాబాద్‌కు తరలించారు. ప్రదీప్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. అవయవదానం చేసిన కుటుంబసభ్యులను పలువురు ప్రశంసించారు.



భవానీలకు అన్నదానం



గన్నవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం ఆధ్వర్యంలో మంగళవారం భవానీలకు అన్నదానం నిర్వహించారు. సీనియర్ రొటేరియన్ జాస్తి విజయభూషణ్ కుమార్ మాట్లాడుతూ, విజయదశమి సందర్భంగా అమ్మవారి దీక్షలో ఉన్న భవానీలకు అన్నదానం చేసే సేవా భాగ్యం కలగడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. దుర్గమ్మ ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు జీవీ రవిబాబు, కార్యదర్శి కె.నాగరాజు, నర్రా సీతారామారావు, కొల్లి జగదీశ్వరరావు, జి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.







బాపులపాడు శివాలయంలో దుర్గాదేవిగా భ్రమరాంబికాదేవి.. రంగన్నగూడెంలో ప్రత్యేక పూజలు.. గండిగుంట దత్తాశ్రమంలో చండీహోమం.. కానూరు శివాలయంలో.. కంకిపాడు శివాలయంలో బోడె వెంకట్రామ్ పూజలు

దివ్య స్వరూపిణి దుర్గమ్మ



దుర్గాదేవిగా వెంకమ్మ పేరంటాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆయురారోగ్యాలను ప్రసాదించే దివ్య స్వరూపిణి దుర్గాదేవిగా మంగళవారం అమ్మవారు దర్శనమిచ్చారు. వీరవల్లిలోని షిర్డిసాయిబాబా ఆలయంలో దుర్గాదేవి రూపంలోని అమ్మవారికి అర్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అష్టోత్తర కుంకుమార్చన నిర్వహిం చారు. కమిటీ సభ్యులు రావి ఈశ్వర్, లంక బేబీ సరోజిని, లింగమనేని రాణి, పద్మశ్రీ తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక భజన నిర్వహించారు. మడిచర్లలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించారు. రంగన్నగూడెంలో దసరా మహోత్సవాల్లో భాగంగా దుర్గాదేవికి ఎన్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, మణికృష్ణ దంపతులు ప్రత్యేక పూజ నిర్వహించారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కనకవల్లి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : దేవీ నవరాత్రుల్లో భాగంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాజరాజేశ్వరిదేవిని సంతానలక్ష్మిగా అలంకరించి పూజలు ఘనంగా నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, బాపులపాడు శివాలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహానికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గన్నవరం : మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్థానిక గాయత్రి మందిరంలో దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కేవీఆర్ కిషోర్ పర్యవేక్షణలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు విచ్చేసి సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం పారాయణం జరిపారు. పాత గన్నవరం, వెంకటేశ్వరస్వామి ఆలయం, యాదవుల రామాలయం, దావాజీగూడెం, సూరంపల్లి తదితర గ్రామాల్లో అమ్మవారు పూజలందుకుంటున్నారు.

ఉయ్యూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు మంగళవారం దుర్గాష్టమి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గండిగుంట దత్తాశ్రమంలో నవరాత్రుల పూజలో భాగంగా అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా లోక కళ్యాణార్థం చండీహోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గండిగుంట పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దయెత్తున తరలి రాగా ఆశ్రమ ట్రస్టీలు అన్న సమారాధన చేశారు. ఉయ్యూరు సోమేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి సామూహిక కుంకు మార్చనలో పాల్గొన్నారు. వంశీ రాయల్ సిటీ, రాజుపేటలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

కంకిపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దసరా నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కంకిపాడు శివాలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్, ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ బోయిన నాగరాజు, సభ్యులు గోగినేని వెంకటరమణ, కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష, వణుకూరు విక్రం, బొర్రా, గుడిసేవ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. ● ఉప్పలూరులో ఏర్పాటు చేసిన అమ్మవారిని కంకిపాడు సీఐ మురళీకృష్ణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు కొండవీటి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కానూరు: కానూరులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం పూజారులు ఫణి, కృష్ణఫణిలు పూజా క్రతువులు నిర్వహించారు.

విజయవాడ రూరల్ : నున్న కనకదుర్గాదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు గుంటక సంధ్యారాణి, సభ్యులు దుంపల కృష్ణ, రామడుగు సీతారామారావు, మూరపాక రాంబాబు పాల్గొన్నారు.

ప్రసాదంపాడు : రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలు అమ్మవారిని దసరా శరన్నవరాత్రి సం దర్భంగా దుర్గాదేవి అవతారంలో అలకరించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకు మార్చనలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఈవో ప్రియాంక తెలిపారు. జి ప్రియ నేతృత్వంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది.

టీటీ స్టేట్ ర్యాంకింగ్‌లో పలు పతకాలు

కానూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలోని వైవీ రావు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం జరిగిన టీటీ ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో దామూస్ టీటీ అకాడమీ క్రీడాకారులు పలు పతకాలు సాధించారని అకాడమి కోచ్ వై. దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలురు అండర్ 15 విభాగంలో జి. లోహిత్, బాలికల అండర్ 11 విభాగంలో జి. మహిమన్విక స్వర్ణపతకాలు, జి. మిషిక కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 72 మందికి షుమారు రూ.47లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీలను పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో పేద ప్రజలు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఆసుపత్రి అవసరాలు తీరకపోయినా తాను ముందుండి అటువంటి కుటుంబాలకు అండగా ఉంటానని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 976మందికి షుమారు రూ. 8.66కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, కొండాప్రవీణ్, సంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కెఎస్ టాకీస్ రోడ్డులోని షేక్ వలీ బాబా సంస్థానం నిర్వాహకులు ఆసీఫ్‌బాబా (కిల్లీబాబా) మంగళవారం అభయాంజనేయస్వామికి

అభయాంజనేయస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

పట్టువస్త్రాలు సమర్పించారు. తన కుటుంబానికి మంచి జరిగినందుకు ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి మొక్కు బడిగా పట్టువస్త్రాలతో పాటు తమలపాకు గజ మాలలు సమర్పించారు. బాబా తన నివాసం నుంచి గుర్రం బండ్ల మీద మేళతా ళాలతో ఊరేగింపుగా తరలి వచ్చి స్వామి వారికి మొక్కుబడి తీర్చారు. అభ యాంజనేయ స్వామితో పాటు ఎదురుగా ఉన్న రామాలయంలో కూడా దేవతా మూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు అర్చనలు జరిపి స్వామి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో బాబా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు సమరిస్తున్న ఆసీఫ్‌బాబా

జాతీయ రహదారి పక్కన డ్రెయిన్ ఏర్పాటు

గన్నవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి శివారులోని జాతీయ రహదారి వెంబడి నిలిచి ఉన్న నీటిని తరలించే పనులు చేపట్టారు. ఇటీవల జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆ ప్రాంతాన్ని పరిశీలించి నీటినిల్వలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నేషనల్ హైవే అధికారులు, పంచాయతీ సంయుక్తంగా ఏటీ కన్వెన్షన్ వైపు డ్రెయినేజీని తవ్వారు. చెరువుగా మారిన నీటిని దుర్గాపురం మీదుగా బుడమేరులో కలిచే విధంగా చర్యలు తీసుకున్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పనులను పరిశీలించారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఘనంగా క్యాపిటల్ హాస్పిటల్ వార్షికోత్సవం

విద్యాధరపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోరంకిలోని క్యాపిటల్ హాస్పిటల్ 8వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మెగా బ్లడ్ క్యాంప్, డెంటల్, మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హాస్పిటల్ యాజమాన్యం డోనేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. తక్కువ ఖర్చుతో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తుందని తెలిపారు. దానం చేసిన రక్తాన్ని తలసేమియా రోగుల చికిత్స కోసం అంకితం చేస్తామని న్యూసిటీ బ్లడ్‌బ్యాంక్ మార్గదర్శకతంలో ఉపయోగకరంగా ఉంటుందని మెడికల్ డైరక్టర్ డాక్టర్ వి. సురేష్ అన్నారు. విజయవాడ ప్రజల కోసం అన్ని వైద్య ప్రత్యేకతలను ఒకే చోట కలిగి ఉండేలా క్యాపిటల్ హాస్పిటల్‌ను సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌గా ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించినట్టు క్యాపిటల్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ హరీష్ మన్నె తెలిపారు. సుమారు 80 మంది రక్తదానం చేశారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి దేవాలయం ప్రాంగణంలో నూతనంగా చేపట్టిన హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి మంగళవారం బాపులపాడుకు చెందిన కంభంపాటి శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి దంపతులు రూ.50వేలు విరాళం అందించారు. దాతలను ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, సభ్యులు గూడపాటి రత్నశేఖర్, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్, వీరమాచనేని నాగయ్య, రాంబాబు, వల్లభనేని అనిల్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

నిబద్ధతతో పనిచేస్తే సముచిత గౌరవం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నిబద్ధతో పనిచేసే ఉద్యోగులకు సముచిత గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ అన్నారు. బాపులపాడు పీఆర్ ఏఈగా పనిచేసిన దోమ జయరాజు పదవీ విరమణ సందర్భంగా మంగళవారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంపీపీ వై.నగేష్, జడ్పీటీసీ సభ్యురాలు కె. గంగాభవాని, టీడీపీ నాయకుడు దయాల రాజేశ్వరరావు, గరికిపాటి శివశంకర్, సుంకర సుభాష్ చంద్రబోస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వెలగపూడి శంకరబాబును అభినందిస్తున్న టీడీపీ నాయకులు

వెలగపూడి శంకరబాబుకు అభినందన

కంకిపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడిన వెలగపూడికి రాష్ట్ర ప్రభుత్వం సముచి తస్థానం కల్పించిందని తెలుగురైతు జిల్లా కార్యదర్శి మద్దాలి సాయిబాబు అన్నారు. దుర్గగుడి పాలక మండలి సభ్యుడిగా వెలగపూడి శంకరబాబును నియమించడంతో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడు తూ, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నాయకుడు లోకేష్ గుర్తింపును ఇవ్వడం అభినందనీయమన్నారు. 2029 ఎన్నికల్లో టీడీపీని మళ్లీ అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపి, శివరామ్, దుర్గ, ప్రసాద్ పాల్గొన్నారు.



ఎస్ఈగా పదోన్నతి పొందిన కృష్ణనాయక్‌ను సత్కరిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఈఈ కృష్ణనాయక్‌కు సత్కారం

ఉయ్యూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఎస్ఈగా పదోన్నతి పొందిన ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్‌ను ఉయ్యూరు, గండిగుంట షిఫ్ట్ ఆపరేటర్లు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఉయ్యూరు డివిజన్ ఈఈగా పనిచేస్తున్న కృష్ణనాయక్ ఇటీవల ఎస్ఈగా పదోన్నతి పొందగా షిఫ్ట్ ఆపరేటర్లు ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావం, సిబ్బంది పట్ల స్నేహ పూర్వక ఆదరణ ఆయన పదోన్నతి పొందడానికి దోహదపడిందని పలువురు కొనియాడారు. డీఈ హేమ కుమార్, ఏఈ బసవశాస్త్రులు, ఎల్ఐ చంద్రశేఖర్, షిఫ్ట్ ఆపరేటర్లు రాజులపాటి జగదీశ్‌బాబు, తలకటూరి విజయరాజు, పామర్తి అంజనేయులు, రత్నాకర్‌రావు, సురేశ్ తదితరులు కృష్ణనాయక్‌ను సత్కరించారు.



అలరించిన చిన్నారుల కూచిపూడి నృత్యం

ఉయ్యూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీజగదాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో చిన్నారుల కూచిపూడినృత్యం అలరించింది. దసరా ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ శ్రీధారా దిఆర్ట్ లాండ్ అకాడమి బాలలు కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.









దసరా వచ్చిందయ్యా!

● విజయవాడ ఉత్సవ్‌లో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు ● పవిత్ర సంగమం వద్ద హెలీరైడ్‌కు ఆదరణ

విజయవాడ కల్చరల్/విజయవాడ సిటీ/ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో పుష్కర కాలం తర్వాత విజయవాడ వైబ్రెంట్ పేరుతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ అందరి ఆదరాభిమానాలు అందుకుంటోంది. పలు వేదికల్లో నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి. ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లు ఆకట్టుకుంటున్నాయి. ఫుడ్ కోర్టుల్లోని వంటకాలను సందర్శకులు ఎంజాయ్ చేస్తున్నారు. దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు, పర్యాటకులు తండోపతండాలుగా వచ్చి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను వీక్షిస్తున్నారు. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా ఆయా వేదికల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు, విశేషాలను ఒకసారి పరిశీలిద్దాం.

ఇంద్రకీలాద్రి వేదికపై..

కనకదుర్గానగర్‌లోని దేవస్థానం కళావేదికపై ఆదివారం ఉదయం సూరంపల్లి గ్రామానికి చెందిన రత్నకుమారి బృందం భజన సంకీర్తన, ఆశ్రీత బృందం, జయరామ సుధాకర్ బృందం, మాధవీ కృష్ణబృందం, రూపనాగ తేజస్వి బృందం సంగీతార్చన చేశారు.తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వై.దుర్గాప్రసాద్ బృందం- శ్రీరామ జననం అనే బుర్రకథను గానం చేశారు. నగరానికి చెందిన భార్గవి, కృష్ణప్రియ, శ్రీవల్లి, పవిత్ర, బెంగళూరుకు చెందిన దివ్య, నెల్లూరుకు చెదిన జాహ్నవి, విజయవాడకు చెందిన రజితాదేవి, వైఎస్‌విఎన్ అనురాధ బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. ప్రదోషకాలంలో కమనీయంగా జరిగే దుర్గామల్లేశ్వరుల నగరోత్సవంలో రేవతి బృందం ప్రదర్శించిన చెక్క భజన, కోలాట నృత్యం ఆకట్టుకున్నాయి. గుంటూరుకు చెందిన విజయగౌరీ, కర్నూలుకు చెందిన సాయి లిక్షిత, విజయవాడకు చెందిన దివ్య స్రవంతి, హర్ష, జావలి, రమాదేవి బృందాలు సంప్రదాయ నృత్యాంశాలు ప్రదర్శన చేశారు. కళాబృందాలకు దేవస్థానం సహాయ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ కే గంగాధర్ ప్రశంసాపత్రం, అమ్మవారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తొమ్మిదో రోజు తొమ్మిది కళాప్రదర్శనలు నిర్వహించారు. నున్నకు చెందిన మందాడకు నాగమనోజ్ఞ, ఎన్ జెన్వికసాయి, నెల్లూరుకు చెందిన కే సంజనారెడ్డి, జగన్, కర్నూలుకు చెందిన గంగాధర్ శిష్య బృందాలు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహూతులను రంజింపజేశాయి. తిరుపతికి చెందిన వెంకటేశ్వర్లు ఆలపించిన వేంకటేశ్వర కల్యాణం, హరికథా గానం నవరస భరితంగా సాగింది. తబలాపై దేవశర్మ, కీబోర్డుపై ఎస్ మురళి వాయిద్య సహకారం అందించారు. తాపేశ్వరానికి చెందిన కే సత్తిబాబు బృందం వీరనాట్యంతో వీరంగం చేశారు. చివరగా ప్రదర్శించిన ఖడ్గ తిక్కన చారిత్రాత్మక నాటకం రక్తి కట్టించిది.

సంగీత కళాశాలలో..

నగరానికి చెందిన జీ సాహితి బృందం సంగీత కచేరీ శ్రావ్యంగా సాగింది. వీరి గాత్రానికి శ్రీదేవి చింతల వయోలిన్‌పై, పాలెపు విమలేష్ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. అనంతరం చింతా వెంకట సీతారామాంజేయుల బృందం ప్రదర్శించిన కూచిపూడి నాట్యబృందం ఆకట్టుకున్నాయి. కాకినాడకు చెందిన కోటా సుబ్రహ్మణ్యం తోలుబొమ్మలాట ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచింది. గంగాధర్ వెంట్రిలాక్విజం, మ్యాజిక్ ఆనందోత్సవాల్లో ముంచెత్తాయి. బావా ఎప్పుడు వచ్చితివి పేరిట భారతంలోని పడక సీను నాటక ఘట్టాన్ని చక్కగా ప్రదర్శించారు. సీహెచ్ అజయ్‌కుమార్ బృందం విద్యార్థుల శాస్త్రీయ నృత్యాలతో మనోరంజకంగా నర్తించారు.

పవిత్ర సంగమంలో..

పవిత్ర సంగమంలో శతమయూరి నృత్యం కన్నుల పండుగగా సాగింది. కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయనర్తనలో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం 100 మంది నృత్య కళాకారులు బృందాల వారీగా తమ నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. నగరానికి చెందిన హంసధ్వని కూచిపూడి నృత్యాలయ బృందం 50 మంది, సత్తెనపల్లి తారక్, ఛత్రపతి నాట్య కళానిలయానికి చెందిన 30 మంది బృందం రుద్ర కళాక్షేత్రానికి చెందిన 20 మంది బృందం కళాకారులు నయానందకరంగా నర్తించి మెప్పించారు. సీహెచ్ అజయ్‌కుమార్ తన శిష్య బృందంతో నవదుర్గలు, అఖిలాండేశ్వరి చాముండేశ్వరి, ఊరూ పల్లెటూరు ఫోక్, హిమగిరి తనయే, గరుడ గమన, శ్రీకరముగా శ్రీదేవి వంటి అంశాలతో మంత్రముగ్దులను చేస్తూ కూచిపూడి నృత్యాంశాలు ప్రదర్శించారు. చివరిగా సత్తెనపల్లికి చెందిన తారక్ ఛత్రపతి నాట్య కళానిలయం, తేనేటి కరుణాకర బృందం అన్నమయ్య కృతులకు చక్కని కూచిపూడి నాట్యాంశాలు నర్తించారు. మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నమైన కూచిపూడి నాట్యానికి కృష్ణాతీరం పుట్టినిల్లు కావడం మన అదృష్టమన్నారు. అనంతరం కళాకారులను సత్కరించి జ్ఞాపిక, సర్టిఫికెట్లను అందించారు. నాట్యాచార్య నరేంద్ర, పావని నిర్వహించారు.



ఫ్లయింగ్ పారాచ్యూట్

విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా విహంగ్ అడ్వెంచర్స్ సంస్థ నగరంలోను, పవిత్ర సంగమం వద్ద పారా మోటార్ ఫ్లైయింగ్ ఏర్పాటు చేశారు. ఒక ఫ్లైయింగ్‌కు ఒకరికి రూ.2 వేలు టిక్కెట్ ధర నిర్ణయించారు. మొదటిసారిగా పారా మోటార్ ఫ్లైయింగ్ ఏర్పాటుతో స్థానికులు, నగరానికి వచ్చే పర్యాటకులు కృష్ణా నదీ తీరంలో విహరించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. క్వాలిఫైడ్ ఫైలెట్స్ నిర్వహణ తోపాటు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డును సీఎం చంద్రబాబు విహంగ్ అడ్వెంచర్స్ సంస్థ నిర్వాహకుడికి అందించారు.

పున్నమీ ఘాట్‌లో..

వేణువుపై ఒకే ట్యూన్‌ను భారతీయ సంగితంతో ప్రారంభించి ఆఫ్రికన్ మ్యూజిక్‌తో మ్యాజిక్ చేసి, ఆస్ట్రేలియన్ సంగీతంతో ముగించిన కెమిలియన్స్ (ఊసరవెల్లి) సంగీతం ప్రేక్షకులను ఆద్యంతం అబ్బురపరిచింది. కేవలం వేణువు, డ్రమ్స్ సాయంతో ఇచ్చిన మురళీ గానం అబ్బురపరిచింది. దాదాపు అరగంట పాటు సాగిన ఈ ప్రదర్శనకు ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. వేదికపై ముందుగా వీర నాట్య మండలి బృందం చేసిన వీర నాట్యం పురాణ కథ రక్తి కట్టించింది. తర్వాత నగరానికి చెందిన కిరణ్మయి, పల్లవి కూచిపూడి నాట్యంతో జయదేవుని ఆటను కళ్లకు కట్టారు. చివరిగా నలంద కాలేజీ కాలేజీ విద్యార్థులు కనకదుర్గాదేవి నాట్య ప్రదర్శన ఇచ్చి అలరించారు. తర్వాత దాండియా డీజే బృందం ప్రేక్షకులతో కలిసి దాండియా నృత్యాలు చేశారు.

విజయవాడ ఉత్సవ్‌లో కాంతారా చాప్టర్ - 1



విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడి ఎగ్జిబిషన్ కళావేదికపై కాంతారా మూవీ టీమ్ మంగళవారం రాత్రి సందడి చేసింది. కాంతారా చాప్టర్ 1 మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి, అతడి సతీమణి ప్రగతి శెట్టి, హీరోయిన్ రుక్మిణి వసంత హాజరయ్యారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. హీరో రిషబ్ శెట్టి మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకుల ఆశీర్వాదం వల్లే కాంతారా మూవీ విజయవంతమైందని, అలాగే అక్టోబర్ 2న విడుదలవుతున్న కాంతారా చాప్టర్ 1 మూవీని సినిమా థియేటర్లో తిలకించి విజయవంతం చేయాలని కోరారు. హీరోయిన్ రుక్మిణి వసంత, కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పనిచేసిన ప్రగతి శెట్టి ప్రేక్షకులు తమ సినిమాను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుందని, అలాగే సినిమా విజయోత్సవాన్ని విజయవాడలో జరుపుకుంటారని ఆకాంక్షించారు.

విజయవాడ ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

గొల్లపూడిలో..
ప్రముఖ సింగర్ కార్తీక్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్
పున్నమిఘాట్‌లో..
సింగర్ రాహుల్ వెల్లాల్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్
డీజే చెండా అండ్ వాటర్ డ్రమ్స్
తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..
హైదరాబాద్ కు చెందిన మయూరి డ్యాన్స్ అకాడమీ బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన
సంగీత కచేరీ
కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన ప్రేమానందం బృందం బుర్రకథ
గుంటూరుకు చెందిన పీవీ రమణ జానపద గేయాలు
కాకినాడకు చెందిన అనపర్తి ఏడు కొండలు బృందంతో తోలు బొమ్మలాట
శ్రీ సత్యసాయి కళానికేతన్ సమర్పించు ప్రసిద్ధ పౌరాణిక పద్యనాటకం శ్రీ కృష్ణ రాయబారం
ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో..
విజయవాడకు చెందిన హవీషా చౌదరి బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన
సంగీత కచేరీ
విశాఖపట్నానికి చెందిన విజయ కుమార్‌తో డాల్ డ్యాన్స్ అండ్ రోబో డ్యాన్స్ ప్రదర్శన
అమలాపురానికి చెందిన వీ సత్యానారాయణ బృందంతో తోలు బొమ్మలాట
విజయవాడ సాంస్కృతిక సమితి విజయవాడ వారిచే సాంఘిక నాటిక 'కలహాల కాపురం'

కళాకారులను గుర్తించిన ఏకైక ప్రభుత్వం

విజయవాడ: కళాకారులకు చేయూతనిచ్చి గుర్తిస్తున్న ప్రభుత్వం ఒక్క కూటమి ప్రభుత్వమేనని కళా ప్రముఖులు, ప్రజాప్రతినిధులు రఘురామరాజు, నవనీతం సాంబశివరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో "సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ" సారథ్యంలో వరల్డ్స్ బిగ్గెస్ట్ ఫెస్టీవ్ కార్నివాల్ విజయవాడ ఉత్సవ్‌కు రోజురోజుకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి కళాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఘంటసాల ప్రభుత్వ కళాశాల వేదికపై పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కూచిపూడి, సంగీత కచేరీ, మ్యాజిక్ షో, తోలుబొమ్మలాట, నాటక ప్రదర్శించిన కళాకారులకు చిరుసత్కారం నిర్వహించారు. కళావేదికపై రఘురామరాజు, నవనీతం సాంబశివరావు, దాసరి జయరాజ్, నాగేంద్ర సింగ్, మోహర్, పీహెచ్ అజిత్‌కుమార్, రఘునాథ్ కళాకారులను సత్కరించారు. ఈ నెల 2న జరిగే విజయవాడ ఉత్సవ్ ఊరేగింపును నగరంలో నిర్వహిస్తున్నామని ఈ ఊరేగింపులో 3వేల మంది కళాకారులు పాల్గొంటారన్నారు.

ఎగ్జిబిషన్‌కు పెరుగుతున్న ఆదరణ

గొల్లపూడిలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది. దేవిశరన్నవరాత్రి రోజుకో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలతో, మ్యూజిక్ కన్సర్ట్‌లతో ఎగ్జిబిషన్‌కు వస్తున్న భక్తులు, ప్రజలు ఎంతో ఆనందిస్తున్నారు. ముఖ్యంగా ఎగ్జిబిషన్‌లో పిల్లలు, పెద్దలు ఎంజాయ్ చేసేందుకు పలు రకాల జెయింట్ వీల్స్ ఏర్పాటు చేశారు. ఇవి కాక ఎడ్యుకేషన్ పెవిలియన్‌లో నార్త్ అమెరికాకు చెందిన మార్టినస్ యూనివర్సిటీ వారు, యూనివర్సిటీ ఆఫ్ గ్రీన్ విచ్ వారు, గన్నవరానికి చెందిన ఉషారామా కళాశాల వారు ప్రత్యేక కౌంటర్స్ ఏర్పాటు చేశారు.

పలు రకాల రుచులతో ఫుడ్ కోర్టు

ఎగ్జిబిషన్‌కు వచ్చే వారికి పలు రకాల వంటకాలతో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేశారు. సుమారు 10 వరకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు ఫుడ్‌కోర్టులోని ఫుడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. కృష్ణామిల్క్ యూనియన్ వారు పాల పదార్థాలను విక్రయిస్తున్నారు.

ఈఫిల్ టవర్ వద్ద సెల్ఫీల సందడి

ఎగ్జిబిషన్ ఎంట్రన్స్‌లో పారిస్ ఈఫిల్ టవర్ నమూనాను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు అలంకరించారు. దీంతో ఎగ్జిబిషన్‌కు వచ్చే వారు అక్కడ ఆగి దాని ముందు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్నారు. మొత్తం మీద గొల్లపూడి ఎగ్జిబిషన్‌కు రోజు రోజుకు ప్రజాదరణ పెరుగుతుంది.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం నగరాభివృద్ధే లక్ష్యం

● బందరుకోట, గిలకలదిండిలో అభివృద్ధి పనులకు మంత్రి రవీంద్ర శంకుస్థాపన

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నగరాభివృద్ధితో పాటు దశల వారీగా తీర ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం బందరుకోటలో కోదండరామస్వామి, హనుమంతుని దేవాలయం వద్ద రూ.30లక్షల విలువైన మూడు సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. 20వ డివిజన్ గిలకలదిండిలో రూ.10లక్షల వ్యయంతో ఓవర్ హెడ్ ట్యాంకు ప్రహరీగోడ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బందరు కోటలో రూ.30లక్షల వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టామన్నారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థతో పాటు రహదారుల విస్తరణపై దృష్టి సారించామన్నారు. బందరుకోటలో మరో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మిస్తున్నామన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ సభ్యుడు లంకే నారాయణ ప్రసాద్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ, టీడీపీ నగరాధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, గుమ్మడి విద్యాసాగర్, తలారి సోమశేఖర్ పాల్గొన్నారు.

ఎడ్లంకలో జాయింట్ కలెక్టర్ పర్యటన



అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాత ఎడ్లంక గ్రామంలో కోతకు గురవుతున్న ప్రాంతం, కొట్టుకుపోతున్న నివాసాలను కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, ఆర్డీవో స్వాతి మంగళవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేస్తామని, గ్రామంలోనే స్థలాలిస్తామని చెప్పటంతో గ్రామస్థులు నిరాకరించారు. నదీ పవాహం తీవ్రంగా ఉందని, గ్రామం పూర్తిగా కనుమరుగవుతుందని, గ్రామంలో నివాసాలిచ్చిన ఉపయోగం లేదన్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, గ్రామానికి రక్షణ కల్పిస్తుందని, నివాసాలు కోల్పోయిన వారికి తాత్కాలికంగా రిహాబిలిటేషన్ కింద వసతి ఏర్పాటు చేస్తామని, గ్రామ పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ రవితేపాల్గొన్నారు.

అంబేడ్కర్.. పేరు కాదు యూనివర్సల్ బ్రాండ్

● ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ● అంబేడ్కర్ నాకు స్ఫూర్తి: ఎమ్మెల్యే వెనిగండ్ల ● అందరివాడు అంబేడ్కర్: ఎమ్మెల్యే వర్ల



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వెనిగండ్ల, తెనాలి, వర్ల

గుడివాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటే పేరు మాత్రమే కాదని, యూనివర్సల్ బ్రాండ్ అని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ అంగరంగవైభవంగా జరిగింది. తొలుత అభిమానులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెనాలి మాట్లాడుతూ ప్రధాని నుంచి సామాన్యుడి వరకు ప్రపంచవ్యాప్తంగా అణిచివేతకు, అసమానతకు గురైన ప్రతి ఒక్కరికి అంబేడ్కర్ పేరే గుర్తుకు వస్తుందన్నారు. దేశంలోని ఆయనపేరు తలచుకోని రాజకీయ పార్టీలకు మనుగడ లేదన్నారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీ మేరకు 2 దశాబ్దాల చిరకాల ఆకాంక్షలు నెరవేర్చడం తనకెంతో సంతోషకరంగా ఉందన్నారు. అంబేడ్కర్ గుడివాడలో పర్యటించిన రోజున ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం మరుపురాని విషయమన్నారు. ఎమ్మెల్యే వర్ల మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడని, యూనివర్సల్ లీడర్ అని కొనియాడారు. అంబేడ్కర్ అభిమానుల కలలను సాకారం చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కర్ణాటక ఎస్పీ జక్కా కిషోర్‌బాబు, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్కాకరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, టీడీపీ మండలాధ్యక్షుడు వాసే మురళీ, జైభీమ్ వెల్ఫేర్ సొసైటీ, దళిత సంఘాల నేతలు, అంబేడ్కర్ అభిమాన సంఘాలు, ప్రజా, స్వచ్ఛంద సంఘాల నేతలు పాల్గొన్నారు.

వీనుల విందుగా చతుర్వేద పారాయణం





ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రి ప్రత్యేక కుంకుమార్చన మంటపంలో మంగళవారం జరిగిన చతుర్వేద పారాయణ సభ వీనుల విందుగా సాగింది. బ్రహ్మశ్రీ చింతపల్లి ఆంజనేయ ఘనపాటి అధ్యక్షతన జరిగిన ఈ పండిత సన్మాన సభకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 450 మంది వేద పండితులు, వేద విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన దుర్గగుడి ఈవో శీనానాయక్ మాట్లాడుతూ 50ఏళ్లుగా దసరా మహోత్సవాల్లో చతుర్వేద పారాయణ సభ జరుగుతోందన్నారు. వివిధ దేవస్థానాల నుంచి వేద పండితులు ఒకేచోటకు రావటం వల్ల వివిధ అంశాల గురించి చర్చించే అవకాశం లభిస్తుందన్నారు. గత ఏడాది కంటే ఎక్కువమందికి పారితోషికం అందిస్తున్నట్టు తెలిపారు. రూ.6వేల చొప్పున 120 మంది ఘనపాటిలకు, రూ.5 వేల చొప్పున 302 మంది క్రమపాటిలకు, రూ.4వేల చొప్పున 20 మంది ఆహితజ్ఞులకు అందజేసినట్టు తెలిపారు. దుర్గగుడి ఛైర్మన్‌గా నియమితులైన బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ సంస్కృతి పరిరక్షణలో వేద పండితుల పాత్ర కీలకమన్నారు. కాణిపాకం దేవస్థానం కార్య నిర్వహణ అధికారి పీ కిషోర్ కూడా పాల్గొన్నారు. 450 మంది పండితులు ఒకే గొంతుకతో చేసిన ఋగ్వేద, యజుర్వేద, సామవేద పఠనం ఆకట్టుకుంది.

రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి

డైరెక్టర్‌గా బచ్చుల సుబ్రహ్మణ్యం



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా మచిలీపట్నానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం (బోసుబాబు) ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ జిల్లాలకు చెందిన 20 మంది ఈ కమిటీలో సభ్యులుగా నియమించారు. వారిలో 16 మంది టీడీపీ నేతలను నియమించగా ముగ్గురు జనసేన, ఒకరు బీజేపీ నేతను నియమించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మృతిచెందిన తరువాత సుబ్రహ్మణ్యం పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. నియోజకవర్గానికి బచ్చుల అర్జునుడు గతంలో ఇన్‌చార్జిగా ఉనప్పుడు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు. వివిధ నియోజకవర్గాల్లో పార్టీ పరిశీలకుడిగా ఉంటూ పార్టీ సభ్యత్వ కార్యక్రమాలతో పాటు పార్టీ ఇచ్చిన వివిధ మెగా ఈవెంట్లు నిర్వహించేందుకు సహకరిస్తున్నారు. సుబ్రహ్మణ్యానికి ఈ పదవి లభించినందుకు మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్‌కుమార్‌తో పాటు టీడీపీ నగరాధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్, పీవీ ఫణికుమార్, చిన్నం శివ హర్షం వ్యక్తం చేశారు.



బండి రామకృష్ణకు వినతిపత్రం ఇస్తున రైతులు

మళ్లీ మా భూములు త్యాగం చేయలేం

● డీసీఎంఎస్ అధ్యక్షుడు బండి రామకృష్ణకు రైతుల వినతి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఒకసారి భూమిలిచ్చాం. మళ్లీ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు నగరానికి దగ్గరలో ఉన్న భూములను ఇవ్వలేం. బైపాస్ రోడ్లతో నగరాభివృద్ధి జరుగుతుంది. కానీ గ్రీన్ ఫీల్డ్‌కు భూములిస్తే మా తరువాత తరాల వారికి భూములివ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది అంటూ డీసీఎంఎస్ అధ్యక్షుడు, జనసేన నేత బండి రామకృష్ణకు మంగళవారం రైతులు మొర పెట్టుకున్నారు. జాతీయ రహదారి పక్కన భూములు ఎకరాకు రూ.15నుంచి రూ.20కోట్ల వరకు పెరిగాయనీ, ఈ నేపథ్యంలో తమ వద్ద భూములు తీసుకోవద్దని రైతులు కందుల రమేష్, పీ కొండలయ్య, జీ రామకృష్ణ వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి పక్కన మరో రోడ్డు నిర్మించడం కంటే దూరంగా మరో రోడ్డు నిర్మించడమే సబబన్నారు. పోర్టు సంబంధిత పరిశ్రమలు నగర జనాభాకు దూరంగా ఉండటమే మంచిదని, దానివల్ల నీటి కాలుష్యం, గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం ఉండదన్నారు. పారిశ్రామిక కారిడార్లు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అయితే ఎగుమతులు, దిగుమతులకు, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు రోడ్లను కొంచం దూరంగా నిర్మించడం వల్ల నగరం మరింత విస్తరిస్తుందన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైన కానిస్టేబుల్‌కు సత్కారం

గుడివాడ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో గత నాలుగు సంవత్సరాలుగా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న హరి ఎస్‌జీటీ పోస్టుకు ఎంపిక కావటం పట్ల ఆనందంగా ఉందని ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు. మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైన బంకురు హరిని సన్మానించారు. అనంతరం కానిస్టేబుల్ పోస్టు నుంచి రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విజయనగరానికి చెందిన హరి చక్కగా రూరల్ స్టేషన్‌లో విధులు నిర్వహించారన్నారు. కానిస్టేబుళ్లు, సిబ్బంది అభినందించారు.



హరిని సత్కరిస్తున్న ఎస్సై చంటిబాబు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జయరాజు

బీఆర్ అంబేడ్కర్ ఆలోచన అందరికీ మార్గదర్శకం

గుడివాడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానం ప్రతిఒక్కరికీ మార్గదర్శకం కావాలని ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు అన్నారు. మంగళవారం స్థానిక గౌరీశంకరపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ భవన్‌లో బాబా సాహెబ్ అంబేడ్కర్ గుడివాడలో పర్యటించి 84 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంతగాని సురేష్, నీలం ప్రభాకర్, దారం నాగేంద్ర, బొడ్డు విల్సన్‌బాబు, బెజ్జం సువర్ణ రాజు, దోనే కోటిబాబు, విజయ్ పాల్గొన్నారు.



నీటిలో కుళ్లిన పసుపు దుంపలను చూపుతున్న నేతలు

వరద బాధిత రైతులను ఆదుకోవాలి

తోట్లవల్లూరు : కృష్ణానది వరద బాధిత రైతులను ప్రత్యేక దృష్టితో ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె శివనాగేంద్రం, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి రంగారావులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తోట్లవల్లూరు వద్ద వరదకు నీట మునిగిన పసుపు, కంద తోటలను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంకల్లో 40 శాతం వరకు విలువైన వాణిజ్య పంటలు వరదకు మునిగి దెబ్బతిన్నాయని తెలిపారు. వరద తగ్గిన తరువాత తక్షణమే పంటల నష్టాన్ని నమోదు చేసి ఎకరాకు రూ. 40 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. లంకల్లో ఈ క్రాప్ నమోదు పూర్తి కానందున గడువు పెంచాలని రైతు సంఘం నాయకులు కోరారు.మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జె ఏసేబు, కె. కొండలబాబు, రైతు సంఘం సీనియర్ నాయకుడు సుబ్బారావు పాల్గొన్నారు.



గుడివాడలో..



గుడివాడ రూరల్‌లో..



కూచిపూడిలో..



పామర్రులో..



పెదపారుపూడిలో..

కనదుర్గాదేవీ నమోస్తుతే..



తోట్లవల్లూరులో..

దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజైన మంగళవారం పలు దేవాలయాల్లోని అమ్మవారు కనకదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

గుడివాడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు కనకదుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు చిన్నా, భక్తులు పాల్గొన్నారు.

గౌరీశంకరస్వామి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లోక కల్యాణార్థం మహా చండీ యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల కమిటీ చైర్మన్ నెరుసు బోసు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవస్థానంలో అమ్మవారు ధాన్యలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల కమిటీ చైర్మన్ అంగడాల సతీష్, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు సౌభాగ్యలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారిని కనకదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 9వ రోజు కనకదుర్గాదేవిగా అలంకరించటంతో భక్తులు వందలాది మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రస్టీ సభ్యులు, అర్చకులు తదితరుల ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మోటూరు, దొండపాడు, చౌటపల్లి తదితర గ్రామాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కూచిపూడి : రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా బాలమ్మ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయ పాలక మండలి సభ్యుల పర్యవేక్షణలో అలంకార ఉభయ దాతల సహకారంతో అర్చక స్వాములు తీర్చిదిద్దిన అలంకారం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రామలింగేశ్వరునికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, చండీ హోమం, శ్రీలలితా పరమేశ్వరి సుహాసిని పూజలు నిర్వహించారు.

పామర్రు : దసరా నవరాత్రి మహోత్సవాలు వైభవంగా పామర్రులో తుది దశకు చేరుకున్నాయి. స్థానిక శివాలయంలో ఎనిమిదోరోజైన దుర్గాష్టమిని పురస్కరించుని మంగళవారం కనకదుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అంకమ్మతల్లి దేవాలయం, వాసవీ మాత ఆలయంతోపాటు బుచ్చిమ్మ ఆశ్రమంలో కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెదమద్దాలి, కురుమద్దాలి, కొరముక్కువానిపురం, దుర్గాదేవిరూపంలో గల మందిరాల్లో పూజాదికాలు జరిగాయి.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులోని భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి ఆలయంలో 9వ రోజు మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తోట్లవల్లూరు రజకపేట రామాలయం వద దుర్గాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రిరాజుపాలెం, వల్లూరుపాలెం శివాలయాల్లో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చింది. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెదపారుపూడి: వెంట్రప్రగడ లోని నామేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు



భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర ఆక్వా కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తికొండ

గుడివాడ : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాష్ట్ర ఆక్వా కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తికొండ రాజబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత గుత్తికొండకు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన వెంట బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ సూరే లక్ష్మీనారాయణ(గాంధీ), ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు చిన్నా తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికుల కిట్‌లను అందజేస్తున్న రావి వెంకటేశ్వరరావు

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

● రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిత్యం సమాజానికి పారిశుధ్య కార్మికులు అందించే సేవలకు వెలకట్టలేనివని, వారు ప్రజారోగ్య పాత్రను పోషిస్తున్నారని వారికి కావలసిన సామాజిక రక్షణ,బీమాల గురించి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గుడివాడ నియోజకవర్గ స్థాయిలోని 285 మంది పారిశుధ్య కార్మికులకు నూతన యూనిఫారం దుస్తులను, ప్రాథమిక ఆరోగ్య కిట్‌లు, సబ్బులు, మందులను రావి వెంకటేశ్వరరావు చేతులమీదుగా అందజేశారు. అలానే పారిశుధ్యకార్మికలకు పోస్టల్ శాఖ వారి ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేయించారు. గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాల్లో డీఎల్‌డీవో సునీత శర్మ, డీఎల్‌పీవో జి.సంపత్‌కుమారి, గుడ్లవల్లేరు ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్, డిప్యూటీ ఎంపీడీవో అంజనాదేవి, పోలవరపు వెంకటరావు, గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

గుడివాడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలోని బాస్కెట్‌బాల్ కోర్టులో స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఒకటో ఎన్టీఆర్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి ఓపెన్ ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఆద్యంతం పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. విజయం కోసం జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. చిత్తూరు జట్టు ప్రథమ స్థానం, రామచంద్రాపురం జట్టు ద్వితీయ స్థానం, ఎస్ఆర్‌యమ్, విజయవాడ జట్టు తృతీయస్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి న్యూ గుడివాడ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, స్టేడియం కమిటీ జీవితకాల సభ్యుడు పిన్నమనేని బాబ్జీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్టేడియం కమిటీ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రూ.30లక్షల వ్యయంతో క్రీడా క్యాలెండర్‌ను తయారుచేసి ప్రతి నెలా ఏదో ఒక క్రీడాకార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ప్రతి జట్టు గెలుపే లక్ష్యంగా కష్టపడతాయని, అంతిమంగా ఒక్క జట్టుకు మాత్రమే గెలుపు సాధ్యమవుతుందన్నారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి జి.చక్రవర్తి, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, స్టేడియం కమిటీ జీవిత కాలసభ్యులు పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన చిత్తూరు జట్టు

ఈ క్రాప్ నమోదు గడువు పొడిగించేనా..!



తోట్లవల్లూరులోని లంకల్లో వరదకు మునిగిన పసుపుతోట

తోట్లవల్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులోని లంకల్లో కృష్ణానది వరదకు పంటలు ముంపునకు గురైన బాధలో రైతుల ఉంటే మరోవైపు ఈ క్రాప్ నమోదు సమస్య వచ్చి పడింది. సెప్టెంబరు 30తో ఈ క్రాప్ నమోదు గడువు పూర్తవుతుందని అధికారులు ప్రకటించారు. లంకల్లో చాలామంది రైతులు తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేయలేదు. పంట నమోదు కాకుండానే వరద వచ్చి ముంచిందని వాపోతున్నారు. గడువు సెప్టెంబరు తోట్లవల్లూరు మండలంలోని లంకల్లో 5 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలుండగా 4,500 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదయిందన్నారు. 500 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేయాల్సి ఉందని ఇన్‌చార్జి ఉద్యానాధికారిణి మానస మంగళవారం తెలిపారు. ఈ క్రాప్ నమోదు కాకపోతే రైతులకు ప్రభుత్వం నుంచి పంటల బీమా గాని, పంటల నష్టపరిహారం అందే అవకాశాన్ని కోల్పోతారు. అందుచేత ఈ క్రాప్ గడువును పెంచాలని లంక రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

జీఎస్టీపై అవగాహన తప్పనిసరి

● ఎంపీడీవో సీతారామరాజు

పమిడిముక్కల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వల్ల పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సూపర్‌గిఫ్ట్ అని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. మంగళవారం మంటాడలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రతి కుటుంబానికి రూ. 15వేల వరకు ఆదా అవుతుందన్నారు. రోజువారీ ఉపయోగించే చాలా వస్తువులపై జీఎస్టీ సున్నా శాతం, లేదా 5 శాతం ఉంటుందన్నారు. ప్రధానంగా రెండు పన్ను స్లాబులు మాత్రమే ఉంటాయని వివరించారు. సూపరింటెండెంట్ గోలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంటాడలో అవగాహన ర్యాలీలో ఎంపీడీవో సీతారామరాజు



జీఎస్టీపై అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

గుడివాడ : స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని మత్స్యకార సహకార సంఘం కమ్యూనిటీ హాల్‌లో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు నాగరాజు ఆధ్వర్యంలో ఆక్వా రైతులు, మత్స్యకారులకు ఏ వస్తువులపై జీఎస్టీ తగ్గింపుపై మత్స్యకారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్లు ఎం.సునీత, వాణిజ్య పన్నుల శాఖ సీనియర్ అసిస్టెంట్ ఎన్.శివ సింహ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వి.మంజూష, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్‌లు, మత్స్యకారులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ మృతి

గుడివాడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : చనిపోయిన రేషన్ డీలర్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రేషన్ డీలర్‌ల సంఘం అధ్యక్షుడు కాగిత కొండ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టిడ్కోకాలనీలో అర్బన్ రేషన్ డీలర్ చెన్నూరి శ్రీనివాసశర్మ మృతి పట్ల రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం కాగిత సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ప్రభుత్వ పథకాలను విజయవంతం చేస్తూ, అనునిత్యం కార్డుదారులకు అందుబాటులో ఉంటున్న రేషన్ డీలర్‌లు చనిపోతే ఆ డీలర్ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కొండ డిమాండ్ చేశారు. గుడివాడ పట్టణ,రూరల్ రేషన్ డీలర్‌ల సంఘం అధ్యక్షుడు కొత్త మురళీ, కర్రే వెంకటగిరి, డీలర్లు గుడివాడ సుమిత్రకుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు 2025









ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల తొమ్మిదో రోజు దుర్గాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దుర్గమ్మను పలువురు ప్రముఖులతో పాటు సినీనటి హేమ, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తదితరులు దర్శించుకున్నారు.

జై భవానీ..

- దుర్గమ్మ నామస్మరణతో కిలోమీటర్ల నడక
- దారిలో అల్పాహారంతో దాతల ఆదరణ
- ఇంద్రకీలాద్రికి పాదయాత్రగా వస్తున్న భవానీలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కాగానే రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు దుర్గమ్మను మొక్కుతూ మాలాధారణ చేపడతారు. కోరిన కోర్కెలు తీర్చే జగన్మాతను దర్శించుకోవడానికి దసరా చివరి మూడురోజులు లక్షల్లో భవానీలు తమ తమ స్వస్థలాల నుంచి అకుంఠిత దీక్షతో తరలివస్తారు. పాదయాత్రగా వచ్చేవారు దూరప్రాంతాల నుంచి అమ్మ దర్శనానికి కొద్ది రోజుల ముందుగానే బయలుదేరి నగరానికి చేరుకుంటారు. వారిలో చిన్నపిల్లల నుంచి వృద్ధులు, మహిళలు ఉంటారు. గమ్యాన్ని చేరేవరకు ఎన్నో కష్టాలను భరిస్తూంటారు. మధ్యమధ్యలో సేదతీరుతూ దాతలు ఇచ్చిన ఆహారాన్ని స్వీకరిస్తూ నడక కొనసాగిస్తూ భక్తితో ఇంద్రకీలాద్రిని చేరుకుంటారు. కాళ్ల నొప్పులు వచ్చినా, బొబ్బలు కట్టినా కనకదుర్గమ్మ దర్శనమే పరమావధిగా ముందుకుసాగుతారు.ముఖ్యంగా కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికశాతం మంది భవాని భక్తులు ఉంటారు. దసరా సమయంలో 9 నుంచి 12 రోజులు మాలాధారణ వేస్తారు. దూరాన్ని బట్టి భక్తులు పాదయాత్ర ప్రారంభిస్తారు. కాలినడకన అమ్మవారిని దర్శించుకోవడానికి వందల కిలోమీటర్లు ప్రయాణిస్తారు. అక్కడక్కడ విశ్రాంతి తీసుకుంటూ వస్తామని భక్తులు చెబుతున్నారు.

కాలినడకన అమ్మవారిని చేరుకోవడం ఓ అనుభూతి

- భవానీ భక్తులు (కాకినాడ)



కాలినడకన వస్తున్న భవానీలు

కాలినడకన వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఒక అనుభూతి. కనకదుర్గమ్మ దయ వల్ల ఆరుగురం కలిసి గురువారం సాయంత్రం కాకినాడ నుంచి నడక ప్రారంభించాం. ఎక్కువగా సాయంత్రం సమయంలో నడక సాగిస్తూ రాత్రి 9, 10 గంటల వరకు ప్రయాణిస్తాం. మధ్యాహ్నం ఎండ వేడికి ఆలసటతో పాటు పాదాలు తొందరగా బొబ్బలు కడతాయి. వాతావరణాన్ని బట్టి ఉదయం నాలుగు గంటల నుంచి ఏడు, ఎనిమిది వరకు నడిచేవాళ్లం. అనంతరం విశ్రాంతి తీసుకుని సాయంత్రం నాలుగు, ఐదు గంటలకు నడక ప్రారంభించేవాళ్లం. అమ్మ దయ.. ప్రజలు, దాతల ఆదరణతో మమేకం అవుతూ.. వారిచ్చే ఫలహారాలు స్వీకరిస్తాం. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తే ఏటా పాదయాత్రగా వచ్చి అమ్మవారిని దర్శించుకునే వారి సంఖ్య పెరుగుతుంది.

వరుసగా మూడో ఏడాది వస్తున్నాం..

గోవింద, వీరబాబు, కనకరాజు (పెద్దాపురం)

ఏటా అమ్మ దీక్ష చేపడతాం. కాలినడకన రావడం ఇది మూడోసారి. పాదయాత్రగా అందరం కలిసి రావడం వల్ల అలసట తెలియదు. అందరం సరదాగా సాగడం నిజంగా ఒక అనభూతి. ప్రజలు ఎక్కడికక్కడ పళ్లు, నీళ్ల బాటిళ్లు, ఇతర ఆహార పదార్థాలు ఇస్తున్నారు. రాత్రి సమయంలో నిద్రించేందుకు స్థలం లేకపోతే మధ్యదారిలో గ్రామస్తులు కాని, షాపుల యజమానులు కాని వారికి తెలిసిన ప్రదేశాలు చూపించేవారు. అమ్మవారి దయవల్ల ఎక్కడా ఆటంకం కలగలేదు.



ఆదాయం రూ.45.56 లక్షలు

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి దసరా మహోత్సవాలలో ఎనిమిదో రోజు సోమవారం మూలా నక్షత్రంనాడు దేవస్థానానికి వివిధ రూపాల్లో రూ.45,56,853ల ఆదాయం వచ్చినట్టు ఈవో శీనానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.2,83,815లు, రూ.100 ప్యాక్ ద్వారా రూ.39,81,900లు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన సేవ(రూ.3000) ద్వారా రూ.54 వేలు, చండీహోమం (రూ.4000) ద్వారా రూ.24వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన ద్వారా రూ.15,348లు, పుస్తకాలు, ఫొటోలు, కాలెండర్లద్వారా రూ.10,770, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ.1,83,760, ఇతరత్రా ఆదాయం రూ.3,260లు మేరకు వచ్చింది. మొత్తం రూ.45,56,853లు ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు. కాగా, తొమ్మిదోరోజు మంగళవారం సాయంత్రానికి వివిధ రూపాల్లో రూ.40,12,917లు ఆదాయం లభించినట్టు ఈవో ప్రకటనలో తెలిపారు.

దివ్య రూపిణి దుర్గమ్మా



భక్తులకు అమ్మ దర్శనం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా ఉత్సవాలలో మంగళవారం దుర్గాదేవి అలంకారంలో దుర్గమ్మను భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. క్యూలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధుల్లో ఉన్న సిబ్బంది మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనానాయక్ సమన్వయంతో భక్తులు, దివ్యాంగులు, వృద్ధులు, చంటిపిల్లలకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రిపై ఎనిమిదోరోజు దుర్గాదేవి అలంకారంలో అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ దంపతులు, ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు కుటుంబసభ్యులు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, పలువురు న్యాయమూర్తులు ఉన్నారు.

భవానీ భక్తులకు ప్రాధాన్యం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భవానీ భక్తులకు పెద్ద పీట వేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. భవానీ మాలభక్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు రెండు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశామని తెలిపారు. సరిహద్దుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయటంతో పాటు స్వచ్ఛమైన తాగునీరు, పాలు, మజ్జిగ, బిస్కెట్లు అందుబాటులో ఉంచాలని సూచించినట్టు తెలిపారు.



హరి జవహర్‌లాల్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో



కుటుంబసభ్యులతో సీపీ రాజశేఖర్‌బాబు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



దుర్గామాతకు విశేష పూజలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ దేవాలయాల్లో అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. బందరు కోట రామాలయంలో అమ్మవారికి మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు పూజలు జరిపారు. **పెడన :** పైడమ్మ దుర్గాదేవి దర్శనమిచ్చారు. **పెడన రూరల్:** వివిధ గ్రామాల్లో దుర్గమ్మగా దర్శనమిచ్చారు. **చల్లపల్లి :** ఆలయాల్లో అమ్మవారు శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డలో కనకదుర్గమ్మ, వేకనూరు అంకాలమ్మ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ఐఏఎస్ అధికారి చినరాముడు



మోపిదేవి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఐఏఎస్ అధికారి వి.చినరాముడు మంగళవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఘన స్వాగతం పలికారు. చినరాముడు నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందించారు. సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో అభివృద్ధి పనులకు విజయవాడకు చెందిన సత్యనారాయణ - పుష్పలీలావతి రూ.50 వేల విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావుకు విరాళాన్ని అందజేశారు.



మండలి వెంకట కృష్ణారావుకు ఘననివాళి

నాగాయలంక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 58వ రోజు మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి మంగళవారం బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతో శారీరక మానసిక ఆరోగ్యం చేకూరుతుందని సత్య సేవ యోగమండలి గురూజీ శ్రీనివాస్ అన్నారు. గొడుగుపేట కన్యకా పరమేశ్వరీ సత్రంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న యోగ శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. కలెక్టర్ బాలాజీతో పాటు పెద్ద సంఖ్యలో యోగసాధకులు పాల్గొన్నారు.



డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన పూర్వవిద్యార్థులకు సన్మానం

చల్లపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీలో ఉద్యోగాలు పొంది ఉపాధ్యాయులు కావాలనే ఆశయాన్ని నెరవేర్చుకున్న చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థులను మంగళవారం రాత్రి కళాశాలలో ఘనంగా సత్కరించారు. స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించిన కెఎల్.సునంద, యడ్ల నాగలక్ష్మి, వై.లెనిన్, బి.రమాంజలి, ఆర్.సీతారామయ్య, ఆర్.మధుబాబు, ఎస్‌జీటీ పి.శ్రీనివాసరావులను పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో సత్కరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ ఎన్‌వి.నరసింహారావు, అధ్యాపకులు సూర్యదేవర నాగేశ్వరరావు, అధ్యక్షుడు గోవిందరాజుల అశ్వినీకుమార్ పాల్గొని ప్రసంగించారు. అసోసియేషన్ ప్రతినిధులు లీలాబ్రహ్మేంద్ర, మేకా రామకృష్ణ, కె.పోతురాజు, ప్రభుత్వ ఉపాధ్యాయులు కొండవీటి నాగరాజు, చింతల శ్రీనివాసరావు, లంకె సుభాషిణి, పలగాని వెంకటేశ్వరరావు, ఆకుల నరసింహారావు, రామ్‌కుమార్, పాగోలు దుర్గాప్రసాద్, లెక్చరర్ రెడ్డొతు సీతారాం పాల్గొన్నారు.

అన్నదాతకు దన్ను!

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల్లో (ఆర్‌ఎస్‌కే) నమోదు చేసే తేమశాతానికి, మిల్లుల వద్ద చూపుతున్న తేమశాతానికి రెండు మూడు పాయింట్లు తేడా వస్తోందని, దీంతో మద్దతు ధరను కోల్పోవాల్సి వస్తోందని, ఆర్‌ఎస్‌కేలలో నిర్ధారించిన తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన అధికారులు ఆర్‌ఎస్‌కేలలో, మిల్లుల వద్ద ఒకే కంపెనీకి చెందిన తేమశాతం కొలిచే యంత్రాలను ఉంచుతామని, దీంతో రైతులకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు సకాలంలో వాహనాలు సమకూర్చడం లేదని, రైతులు సొంత వాహనాలు ఏర్పాటు చేసుకుని ధాన్యం రవాణా చేసేందుకు అనుమతులు త్వరితగతిన ఇవ్వాలని, రవాణా చార్జీలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టకుండా విడుదల చేయాలని ఈ సందర్భంగా రైతులు కోరారు. ధాన్యం రవాణాకు సంబంధించి వాహనాలను సమకూర్చడంతో పాటు, ఇప్పటి వరకు పెండింగ్‌లో ధాన్యం రవాణా చార్జీల బకాయిలను కూడా సాధ్యమైనంత త్వరగా విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మిల్లర్ల ద్వారా గన్నీ బ్యాగులు ఇచ్చే సమయంలో ధాన్యం కొనుగోలులో మధ్యవర్తులుగా ఉన్నవారు తమకు అనుకూలమైన రైతులకు ముందస్తుగా గన్నీ బ్యాగులు ఇస్తున్నారని, దీంతో అధికశాతం మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతులు తెలిపారు. మిల్లర్లతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి గన్నీ బ్యాగులను అందిస్తామని, ఈ ప్రక్రియపై నిత్యం నిఘా ఉంచుతామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో పాటు ధాన్యం లోడుతో వచ్చిన లారీలను కాటా వేసే సమయంలో ధాన్యం తూకం ఎంతమేర ఉందో తెలిసేలా మిల్లుల బయట కనపడేలా డిజిటల్ మీటరును ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.

జిల్లా యూనిట్‌గా ధాన్యం కొనుగోలు

యంత్రాల ద్వారా ఒకేసారి పలు ప్రాంతాల్లో కోతలు పూర్తిచేయడంతో ఇబ్బడిముబ్బడిగా ధాన్యం మిల్లులకు వస్తున్నాయని, దీంతో మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం దించుకోవాల్సి వస్తోందని మిల్లర్లు తెలిపారు. వర్షం పడితే మరింతగా ధాన్యం మిల్లులకు చేరుతోందని, తేమశాతం అధికంగా ఉన్న ధాన్యం ఒకేసారి మిల్లుకు వస్తే డ్రయ్యర్ సామర్థ్యం సరిపోక తాము నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరస్థితిలో ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వస్తే ఆయా గ్రామాల్లోని ధాన్యం జిల్లాలోని ఏ మిల్లుకైనా విక్రయించేలా అనుమతులు ఇస్తామని, అవసరమైతే ఇతర జిల్లాలోని మిల్లులకు ధాన్యం పంపుతామని అధికారులు చెప్పారు. తేమశాతం అధికంగా ఉన్న ధాన్యం మిల్లులో నిల్వ ఉంచితే తాము నష్టపోతున్నామని మిల్లర్లు తెలపగా, ధాన్యం మరపట్టే సమయంలో వచ్చే తౌడు, నూకలు, ఊక తదితరాల లెక్కలు మిల్లర్లు చెప్పడంలేదని, మిల్లులకు నష్టం రాదని, ఈ సాకుతో రైతులను ఇబ్బందులపాలు చేయవద్దని రైతులు కోరారు. ధాన్యంలో నాణ్యత నిర్ణయించేందుకు వ్యవసాయశాఖ అధికారులకు అధికారాలు ఇవ్వాలని, గతంలో ఈ పద్ధతి అమలులో ఉండేదని రైతులు తెలిపారు. మినీ మిల్లింగ్ మిషన్‌లను అందుబాటులో ఉంచితే, అక్కడే ధాన్యంలో నాణ్యత తెలుస్తుందని చెప్పారు. మిల్లర్లు, రైతులకు ఇబ్బంది లేకుండా సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుందామని సమావేశంలో నిర్ణయించారు.

దుర్గే దుర్గతినాశని..

(5వ పేజీ తరువాయి)

సమయానికి 1,05,972 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. 32,006 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీ కొనసాగుతోంది.

తొమ్మిది రోజులు.. 10 లక్షల మంది

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఇప్పటి వరకు 10,81,190 మంది భక్తులు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. మూలా నక్షత్రం రోజున ఆలయం మూసివేసే సమయానికి 1,94,097 మంది భక్తులు సరస్వతీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. 22న 84,417 మంది, 23న 90,190 మంది, 24న 1,00,110 మంది, 25న 1,30,846 మంది, 26న 1,25,486 మంది, 27న 1,21,690 మంది, 28న 1,28,382 మంది, 29న 1,94,097 మంది అమ్మవారిని వివిధ అలంకారాల్లో దర్శనం చేసుకున్నారు. మంగళవారం 1,05,972 మందికి అమ్మవారు దర్శనం ఇచ్చారు. మొత్తం ఇప్పటి వరకు 10,81,190 మంది కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అన్న ప్రసాదాన్ని 2,70,791 మంది స్వీకరించారు. తొమ్మిది రోజుల్లో మూలా నక్షత్రం రోజున అధిక సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనం ఇవ్వనున్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

విజయవాడ/మచిలీపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో మెగా డీఎస్సీ-2025లో భాగంగా ఎంపికైన 1203 మంది అభ్యర్థులకు ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారులు యూవీ సుబ్బారావు, డీఈవో పీవీజే రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు వారికి కేటాయించిన కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆయన వెల్లడించారు. పామర్రులోని ప్రగతి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో 945 మందికి, నిడమనూరులోని వాహిణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో 258 మంది అభ్యర్థులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులందరూ తమకు కేటాయించిన కేంద్రాల్లో ఎనిమిది రోజుల ఇండక్షన్ ట్రైనింగ్‌కు తప్పనిసరిగా హాజరవాలని ఆయన సూచించారు.

పాల ఉత్పత్తులు పెరగాలి

మోపిదేవి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద, పాల ఉత్పత్తి వృద్ధి చెందేలా కృషి చేయాలని పామర్రు పాలశీతలీకరణ మేనేజర్ సిహెచ్.గోపీకృష్ణ తెలిపారు. రావివారిపాలెం పాల ఉత్పత్తిదారుల సంఘం పరిధిలోని పాడి రైతులకు మంగళవారం బోనస్‌లు పంపిణీ జరిగింది. సంఘం అధ్యక్షుడు రావి లక్ష్మణరావు, మాజీ అధ్యక్షుడు రావి రామనాథం, జి.శివరామకృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు వేములపల్లి పిచ్చేశ్వరరావు ఉన్నారు.



పీఏసీఎస్ అధ్యక్షుడు బండి పరాత్పరరావును సత్కరిస్తున్న చిలకలపూడి రైతులు

రైతుల సహకారంతో పీఏసీఎస్ అభివృద్ధికి కృషి

ఘంటసాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతుల సహకారంతో జలదీశ్వర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ బండి పరాత్పరరావు తెలిపారు. సంఘ ఆవరణలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. అర్హత గల ప్రతి రైతుకు రుణాలు ఇవ్వటంతో పాటు వారికి మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఆధ్వర్యంలో చైర్మన్ బండి పరాత్పరరావును చిలకలపూడి రైతులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సభ్యులు దాసరి సీతారామాంజనేయ ప్రసాద్, రాజులపాటి వీరాచారి, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, రైతులు అయినపూడి విజయ్ కుమార్, కాకుమాని రంగారావు, గొర్రెపాటి సురేష్, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర కృష్ణమ్మ

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. చల్లపల్లి మండలం నడకుదురు, రాముడుపాలెం, ఆముదార్లంక, లచ్చిగానిలంక తదితర గ్రామాల పరిధిలోని కరకట్ట వెంబడి ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోని పసుపు, కంద, అరటి తోటల్లోకి వరద నీరు చేరింది. అవనిగడ్డ మండలం పులిగడ్డ, పల్లెపాలెం, సీతాలంక తదితర గ్రామాల్లోని పంటలు నీట మునిగాయి. తోట్లవల్లూరు మండలం భద్రిరాజుపాలెం, వల్లూరుపాలెం, పాములలంక, దేవరపల్లి, చాగంటిపాడు, రొయ్యూరు, ఐలూరు గ్రామాల పరిధిలోని ఉద్యాన పంటల తోటల్లోకి భారీగా వరదనీరు వచ్చింది. రెండు రోజులుగా వరద నీరు పంట చేలలోనే నిల్వ ఉండటంతో పంటలు రంగుమారి చనిపోయేస్థితికి చేరుకున్నాయి. కృష్ణానదికి వరద మరో మూడు, నాలుగు రోజులు కొనసాగుతుందని, దీంతో పంటలు కోల్పోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగాయలంక మండలం ఎదురుమొండి తదితర గ్రామాల వద్ద కృష్ణానది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. అవనిగడ్డ మండలం యడ్లంక గ్రామం వద్ద వరద నీటి ప్రవాహం మరింతగా పెరిగింది. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని మండలాల్లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, జలవనరులశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికపుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

1451.48 హెక్టార్లలోని వాణిజ్య పంటలకు దెబ్బ


కృష్ణానది వరదల కారణంగా మంగళవారం నాటికి 2,171 మంది రైతులకు చెందిన 1451.48 హెక్టార్లలో వాణిజ్య పంటలు నీటిలో మునిగినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికను పంపారు. పసుపు, అరటి, కంద, బొప్పాయి, కూరగాయల తోటలు నీటిలోనే ఉన్నట్లు పేర్కొన్నారు. కంకిపాడు మండలంలో ఎనిమిది హెక్టార్లు, పెనమలూరు మండలంలో 28.50 హెక్టార్లు, తోట్లవల్లూరు మండలంలో 961.98 హెక్టార్లలో వాణిజ్య పంటలు నీటమునిగాయి. మోపిదేవి మండలంలో 180.40 హెక్టార్లు, అవనిగడ్డ మండలంలో 44.80 హెక్టార్లు, చల్లపల్లి మండలంలో 222 హెక్టార్లు, ఘంటసాల మండలంలో 5.80 హెక్టార్లలో వాణిజ్య పంటలు ముంపులో ఉన్నాయి.

జిల్లా అంతటా వర్షం

జిల్లా అంతటా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మచిలీపట్నం, గుడివాడ తదితర ప్రాంతాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ నెల 4వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మండలి పర్యటన

మోపిదేవి : వరద ఉధృతికి ముంపునకు గురైన బొబ్బర్లంక, కె.కొత్తపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం పర్యటించారు. పసుపు, కంద, అరటి, పంటలను పరిశీలించి వెంటనే పంట నష్టం అంచనాలు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కె.కొత్తపాలెం దళితవాడ, గౌడపాలెం ప్రాంతాల్లో నీటమునిగిన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మండలి వెంకట్రామ్, గ్రామాల సర్పంచ్‌లు దొప్పలపూడి గంగాభవాని, కొక్కిలిగడ్డ మాధవి, పీఏసీఎస్ అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, దొప్పలపూడి జగదీష్, ఉద్యాన శాఖాధికారి రమేష్, కోనేరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బొబ్బర్లంకలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి మండలంలో 502 ఎకరాల్లో వాణిజ్యపంటలకు నష్టం

చల్లపల్లి : కృష్ణానదిలో వరద ప్రవాహం సాగుతున్న నేపథ్యంలో వాణిజ్యపంటలు నీటిముంపులోనే ఉన్నాయి. మండలంలో 502 ఎకరాల్లో పంటలు నీటిముంపులో ఉన్నట్లు ఉద్యానవనశాఖ అధికారిణి జె.కీర్తి తెలిపారు. ఈమేరకు ప్రాథమిక అంచనాలు ఉన్నతాధికారులకు అందించామన్నారు. అత్యధికంగా ఆముదార్లంక గ్రామంలో 250 ఎకరాలు, నడకుదురు, పురిటిగడ్డ పంచాయతీల పరిధిలో 252 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పసుపు, అరటి, కంద, కూరగాయల తోటలు నీటిముంపులో ఉన్నాయి.

పెరుగుతున్న వరద

నాగాయలంక : నాగాయలంక రేవులో గంట గంటకు వరద ఉధృతి పెరుగుతోంది. శ్రీరామపాదక్షేత్రంలోని పుష్కరఘాట్‌కు భారీగా వరద చేరింది. చినకరకట్ట కింద గృహాలు, రొయ్యల కంపెనీలు, చేపల కంపెనీలు, కోళ్ల ఫారాలు చుట్టూ వరద నీరు భారీగా చేరింది. జడ్పీ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి 17 మత్స్యకారుల కుటుంబాలను అధికారులు చేర్చారు.

అవనిగడ్డలో స్థలాలిచ్చి ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ రూరల్: వరద కోతకు గురై పాత ఎడ్లంకలో ఇల్లు కోల్పోయిన వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. పాత ఎడ్లంక గ్రామంలో పర్యటించి ప్రజలతో ఆయన మాట్లాడారు. అవనిగడ్డలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. వైసీపీ నాయకులు లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాస్, చింతలపూడి బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ఫౌంటెన్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, పక్కన నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్‌కు సత్కారం

బందరును సుందరంగా తీర్చిదిద్దుతాం


• మంత్రి కొల్లు రవీంద్ర


మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పచ్చదనం పెంపొందిస్తూ ఫౌంటెన్లు ఏర్పాటు చేసి బందరును సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

పరాసుపేట సెంటర్‌లో వాటర్ ఫౌంటెన్‌ను మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, కొనకళ్ల బుల్లయ్య, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, ఆలపాటి రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నెస్ట్ సేవలతో నోబుల్ కళాశాలకు మంచి గుర్తింపు

ప్రిన్సిపాల్‌గా, ఇంగ్లీషు లెక్చరర్‌గా నోబుల్ కళాశాలలో 30 ఏళ్లపాటు విద్యాసేవలందించి ఎస్.జె.ఎర్నెస్ట్ కళాశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పదవీ విరమణ సందర్భంగా ఎర్నెస్ట్‌ను నోబుల్ కళాశాలలో మంగళవారం ఆయన ఘనంగా సత్కరించారు. ఫాదర్ ఎడ్విన్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన సత్కార సభలో రెవరెండ్ కొర్నేలియస్, నళిని, జాషువా కుమారి, రిటైర్డ్ ఐఏఎస్ బి.కృపానందం, డయాసిస్ మాజీ సెక్రటరీ టి. రవికుమార్, సుధీర్ దత్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ కౌన్సిలర్లు బత్తిన దాసు, లోగిశెట్టి వెంకటస్వామి, నోబుల్ థామస్ పాల్గొన్నారు.





PLOTS FOR SALE

» అమరావతి-కాజా-గ్రేటర్ విజయవాడలో ORR దగ్గరలో CRDA అప్రూవ్ గల 133 గజాలు పైన గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు, క్లబ్ హౌస్ ఎమినిటీస్‌తో అమ్మకానికి కలవు. ✆ 95028 22335
AJB-235823

» విజయవాడ, కంచికచర్ల, ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో AP CRDA, DTCP ప్లాట్స్, చ.గ. 3,900/- నుండి 7,800/- ఇళ్ళ మధ్యలో ప్లాట్స్, ఫామ్ హౌస్ ప్లాట్ 1 సెంటు 1,45,000/- సెల్ : 63012 98734
AJB-107

» బందరు రోడ్డుకి కిలోమీటరు దూరములో, Proposed అమరావతి రింగు రోడ్డుకి సమీపంలో, నెప్పల్లి గ్రామ ఎంట్రెన్స్ మలుపు వద్ద ఉన్న 200 ప్లాట్ల సముదాయములో, పది ఇళ్ళు కట్టుకొని నివసిస్తున్నారు. ఆ ప్లాట్ల సముదాయములో, పశ్చిమ ఫేసింగు 187 No, 250 చ.గ. వైశాల్యము కలిగిన ప్లాటు అమ్మకమునకు కలదు. ఆసక్తి కలవారు డైరెక్ట్‌గా సంప్రదించగలరు. సెల్ : 76740 22035
AJB-236121

WANTED

» ప్రముఖ ఆటోఫైనాన్స్ నందు అనుభవం కలిగిన లేడి కంప్యూటర్ ఆపరేటర్, టెలీకాలర్ కావలెను & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ సొంత బైకు ఉండాలి. Qul: డిగ్రీ. సెల్ : 9949558181
AJB - 235822

DISTANCE EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA. ✆ 99493 08940
AJB-235758

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి